పాడి - ఆది

అంటి నిన్ను బాయలేని - దాపె తలనేవేగేనా
వెంట వెంట దిరుగరా - వెలదు లెల్లాను

తలకొని నీమోము - తప్పక చూచితేను
వలవరా యెటువంటి - వనితలైనా
సెలవుల నేపాటైనా - చిరునవ్వు నవ్వితేను
మొలవవా పులకలు - మోపుల కొలదులు ?

చనవున నీతోను - సరసములాడితేను
మనసులు కరగరా - మగువలెల్లా
యెనసి నీతోగన - యేపాటి మాటాడినాను
తనుదానె కాగిళ్ళు - తగులు కోకుండునా

నివ్వటిల్లు తమకాన - నీమేను సోకితేను
నివ్వెరగు బొందరా - నెలతలెల్లా
రవ్వగా శ్రీ వేంకటేశ - రతి నలమేలుమంగ
యివ్వల కూడినందుకు - హెచ్చవా వేడుకలు

అన్నమాచార్యులు అద్వైతి. వేంకటేశ్వర పరచర్చకై పరమాత్మ జీవాత్మ లిద్దరు ఏర్పడాలి గనుక ద్వైతం ఆయన పదాలలో సాక్షాత్కరించింది.

'ఆవామే వామార్థే సకలము భయాకార ఘటనాత్

ద్విధా భూతం రూపం' అన్నట్లుగా పరమేశ్వరుడు ఒక్కడే. ప్రకృతి పురుషులిద్దరు. రససిద్ధికి ఇద్దరూ ఉండాలి. రస రసాస్వాదు లిద్దరూ. ఏకత్వనుండి ద్వైతం' అనేకత్వం కలగటంగూర్చి మయూరమహాకవి చెప్పిన చక్కని శ్లోకం ఉన్నది సూర్యశతకంలో

ఏకంజ్యోతిః దృశౌద్వే త్రిజగతి గదితాన్యబ్జ జాస్యై శ్చతుర్భిః

భూతానాం పంచమం యాన్య లమృతుషు
తధాషట్సు నానావిధాని

యుష్మాకం తాని సప్తత్రిదశ ముని మతాన్యష్ట దిగ్భాంజి

భానోర్యాంతి ప్రాప్తే నవత్వం దశ దధతు శివం దీధి

తీనాం శతాని

అది ఒకే వెలుగు రెండు (కన్నుల) చూపులుగా మూడులోకములలో నాలుగు ముఖాల బ్రహ్మచేత అయిదు భూతాల రూపమై ఆరు ఋతువుల కాల విధానమై ఏడుగురు మహుర్షుల సతులు స్వీకరిస్తూ, ఎనిమిది దిక్కులనూ కాంతింపజేస్తూ ప్రభాతవేళ నిత్య నవమైన (తొమ్మిదియైన) రవి అరుణోదయ కాంతులు మీకు పది నూఱుల శుభములు ఒనర్చుగాక అని స్థూలార్థం. ఒక వెలుగే ఇన్నీ అయినది.

నిరతి శయమైన ప్రేమ శృంగారరసానికి స్థాయీభావం.
దానికేరతి అని వ్యవహారం. (రతి అంటే సామాన్యార్థంలో తెలిసే స్త్రీ పురుష శారీరక సంగమ సుఖం అన్న అర్థం ఇక్కడ నిరర్థకం) రసమంటే ఏమిటి? రసమే బ్రహ్మం అనిశ్రుతి రసోవైనః ర స గ్గ్ హ్యేవాయగ్ం లబ్ధ్వానందీ భవతి అని తత్ప్రమాణం. శ్రీవేంకటేశ్వరుడు రసపరబ్రహ్మ. ఆయనను జగమంతా వెతుకుతూ ఉంటుంది. జగమంతా ఆయన నిండి ఉన్నా జగత్తులోని ప్రత్యంశమూ ఆయన అయి, ఆనందాన్ని పొందుదామని ప్రయత్నిస్తుంది. ద్వైతం అద్వైతమౌతుందన్న మాట. అనేక రూపమైన సృష్టి పరమానంద స్థితిలో పరమేశ్వరునితో ఐక్యం చెందుతుంది. ఆ ఆనందమే బ్రహ్మ. ఆ కారణంగానే భూతాదులన్నీ ఉద్భవించి, వసించి లయిస్తున్నాయి అని తైత్తిరీయోపనిషత్తు (ఆనందం బ్రహ్మేతివ్యజౌనాత్ ఆ సందాయేఖల్విమాని భూతాని జాయంతి యేనజాతాని జీవంతి -భృగువల్లి) ఆనందాన్వేషులై తపిస్తూ పరతత్వాన్ని చేరే జగత్తంతటికీ ప్రాతినిధ్యం వహించేవారు మునులు, యోగులు, భక్తులు, సాధకులు. ఈ జగత్ప్రతినిధులకు ప్రాతినిధ్యంవహించేవారు అన్నమాచార్యుల శృంగార నాయికలు. వారిలో ముఖ్య ప్రతినిధి అలమేల్మంగ. ఆమె గుణస్వరూప స్వభావాలే అన్నమాచార్యుల మధుర భక్తి తత్వ స్వరూపస్వభావం ప్రకృత సంకీర్తనలో అన్నమాచార్యుల భక్తితత్వం అతిప్రౌఢమై, అలమేల్మంగయై పరమేశ్వరాన్వేషియైన చరాచర జగత్తంతటికి ప్రాతినిధ్యం వహించింది.

శ్రీ వేంకటేశ్వరునితో యితర నాయికలందరూ (మునులు, యతులు, గోపికలు, అన్నమాటలివి. నిన్ను ముట్టి నిన్ను విడచి ఉండలేనితనం ఆమెలో మాత్రమే ఉదయించినదా? నిన్ను విడజాలక స్త్రీ లంతా (జగత్తంతా) నీ వెంట తిరగటం లేదా? (మూలాధార చక్రధ్వని.)

నీ ముఖపద్మం జూడగలిగితే ఎంతటివారైనా సమ్మోహితులుకారా? వారి కోర్కెలు నీ ముఖదర్శనంవల్ల తీరుతాయని భావించరా? (మణిపుర చక్రం అని ధ్వని). నీవు

చిన్న చిరునవ్వు నవ్వితే ఆ దీప్తికి వారి మేన పులకలు మోపులుగా పొడమవా? (చిరు నవ్వు దీప్తి స్వాధిష్ఠానచక్రమని సూచన).

నీతో చనువుతో సరస క్రియలు చేస్తే వారి ఎదలు కరగిపోవా? (అనాహత చక్రం) నీతో యేమాత్రపు సంభాషణ నెరపినా నీ కౌగిలిలోకి తమంత తాము బంధింప బడరా (విశుద్ధ చక్రం)

ఉధృతమైన ప్రేమతో నీ మేనిస్పర్శ గలిగితే దిగ్భ్రాంతి చెంది చేష్టలు దక్కరా? (ఆజ్ఞా చక్రం జితమనోవస్థ). శ్రీవేంకటేశ్వరా; భక్త జగత్ప్రతినిధియైన అలమేల్మంగ నిన్ను కూడితే, నీవామెను కలసితే అనుపమానమైన ఆనందం జగత్తుకే కలుగదా? (త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలో జగదానందకారక జయజానకీ ప్రాణనాయక అన్న సంబోధన భావ మిదే. జానకీ ప్రాణనాయకు (అలమేల్మంగను గలిసినాడుగనుక) డైనాడు గనుక, ఆ జానకి జగద్రూపగనక ఆయన జగదానంద కారకుడైనాడు. అలమేల్మంగయే జానకి. సీతాపతియే శ్రీనివాసుడు. అన్నమాచార్యులే త్యాగరాజస్వామి. ఈ కీర్తనలోని క్రియావా చక పదాలు వెంట వెంట తిరుగుట, మోము చూచితే వలచుట, పులకలు మొలచుట, మనసులు కరుగుట ఇత్యాదులు అన్నీ భక్తుడైన యోగికీ, ప్రేమాస్పదయైన శృంగార భామకూ సమానం.

'ఇదిగాక సౌభాగ్యమిదిగాకతపము' అన్న సంకీర్తనవలె ఇందుకూడా యోగతంత్ర విషయాలైన షట్చక్రాలు సూచింపబడ్డవి షట్చక్రాల ఉనికి యోగి శరీరానికి. నాయిక దేహానికీ సమానం. పరబ్రహ్మానంద పదాన్ని, షట్చక్రాలని తనకుండలినిచే అధిగమించి పొందుదామన్న యోగి జ్ఞాతప్రయత్నమూ, శ్రీవేంకటేశ్వరుని వరునిగా పొందుదామని శృంగార రసపరాకాష్టకై నాయికలు చేసే ముగ్ధయత్నమూ సమతౌల్యాలు. సహస్రారకమ ల స్థితికి వచ్చేటప్పటికి, శ్రీవేంకటేశ్వరునితో రతిగూడిన అలమేల్మంగ రూపు నాయికకూ యోగికీ సిద్ధించింది. వారిరువురకూ అభేదమేర్పడింది. ఆ యోగియే అన్నమాచార్యులు. ఆ నాయిక అలమేల్మంగ. అలమేల్మంగయే అన్నమాచార్యులు. అన్నమాచార్యులే అలమేల్మం గ అయ్యారు. ఆ స్థితిలో వారు - ఏకాకృతినొందిన యోగుల నాయికల ప్రతినిధియై, ఆయారూపుల తనలో ఐక్యం చేసుకున్న అలమేల్మంగ రూపు పొందిన అన్నమాచార్యులు స్వామిలో లీనమయ్యారు. స్వామికి సంతోషమైనది జగత్తుకు ఆనందం కలిగి బ్రహ్మానుభ వమైనది అద్వైతంలో ఆరంభమైన ద్వైతం అద్వైతంలో అంతర్లీనమైనదని, ద్వైతాద్వైతాలు పరస్పరాశ్రయాలు అని అద్వైతాన్ని ఆవిష్కరించారు అన్నమాచార్యులు.